
# అనుభవం నేర్పిన జీవిత పాఠం

## గంటి భానుమతి



''మనం నాగరిక సమాజంలోనే ఉంటున్నామా!'' లంచ్ చేస్తూ అన్నాను నేను.

కనుబొమ్మలు ముడిచి, నాకేసి చిత్రంగా చూసింది శ్వేత. ''పెద్ద అనుమానమే వచ్చిందే! అయినా అదేం ప్రశ్న?'' అని అంది. ఒక నిమిషం ఏం మాట్లాడ కుండా దాన్నే చూసాను.

''హ్యూమన్ రైట్స్ డే లాగా, హ్యూమన్ డ్యూటీస్ డే కూడా ఉండాలి. హక్కులేమిటో, బాధ్యతలేమిటో తెలుస్తాయి.'' విస్మయంగా చూసింది. తింటూన్న బర్గర్‌ని కింద ప్లేట్లో పెట్టింది. తన ఎడం చేతిని, నా కుడి భుజం మీద వేసింది. ''ఏవయింది? ఏం జరి గింది? ఇలా మాట్లాడుతున్నావేమిటీ? నువ్వు , ఈ సమయంలో, ఏ మాత్రం టెన్షన్ లేకుండా ఉండాలి. అసలు, మొదటి మూడు నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలి. కడుపులో బిడ్డ ఆకారం దిద్దుకునే సమయం....

''ఏం ఆకారమో ఏమో! నా బతుకేమిటో నీకు అర్థం కావడం లేదు. ఇంత చదువుకున్నా, ఇన్ని వేలు సంపాదిస్తున్నా, వాకింగ్ ఎన్‌సైక్లోపీడియా లాంటి దాన్ని... కానీ... లివింగ్ ఫెయిల్యూర్‌ని. నా స్వేచ్ఛ ఏవిటో నాకు తెలీడం లేదు. ఉద్యోగం, బయటి కెళ్ళడం అంటే స్వేచ్ఛా! నా స్వంత అభిప్రాయాల్ని చెప్పడం స్వేచ్ఛ కాదా! టోటల్ కన్‌ఫ్యూజన్....''

రెట్టించి అడిగాకా విషయం శ్వేతకి చెప్పాను.

కుర్చీలో వెనక్కి వీపునానించుకుని నావైపు చూసింది.

''ఇది ప్యూర్ పర్సనల్ విషయం. నీ సంగతి నాకు తెలుసు. కాబట్టి చెప్తున్నాను. నువ్వు ఏ మాత్రం ఆవేశపడకు. అది నష్టం తెస్తుందే కానీ, పరిష్కారం చూపదు... అందుకని, ఆచి-తూచి మాట్లాడు నీ అభిప్రాయాల్ని, వ్యక్తిత్వాన్ని త్యాగం చెయ్యడమా, కాపురాన్ని త్యాగం చేయడమా అన్న తర్కాన్ని, డిబేటుని పెట్టుకోకు. నీలాగే నేను కూడా అబార్షన్‌కి వ్యతిరేకం. నా సహాయం నీకుంటుంది. నా భుజం నీకెప్పుడూ ఉంటుంది. ప్రస్తుతం మౌనంగా ఉండడమే నువ్వు చెయ్యాల్సింది. మెల్లిగా మీ అత్తగారిని సంప్రదించు.....'

ఆ తర్వాత మా యిద్దరి మధ్య నిశ్శబ్దం.

జన్మతః సంక్రమించుకున్న హక్కులు, అహంకారం, అధికారం వల్లనే కదా, నీరవ్ అంత మాట అనగలిగాడు.

ఒకవైపు నీరవ్ అహంకారం, మరోవైపు నా అస్తిత్వం ఈ రెండూ కలిసి, నా మనసు మీద, ఆలోచనల మీద సవారీ చేస్తున్నాయి.

ఈ పెళ్ళి అయ్యాకా, గడిపిన రెండేళ్ళ జీవితాన్ని ఆడిట్ చేస్తే మిగిలేదేవిటో నాకు తెలీడం లేదు. జరిగింది యిది. నాలుగు రోజుల క్రితం.

రాత్రి తొమ్మిది గంటలకి, భోజనం అయ్యాక, నీరవ్ ఒళ్ళో లాప్‌టాప్ పెట్టుకొని, పనిచేస్తూ మధ్యలో ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ, టీవీలో బిజినెస్ న్యూస్ చూస్తూ సోఫాలో కూచుని ఉన్నాడు.

వంటిల్లు సర్దేసి, లైటు కూడా ఆర్పేసి, నీరవ్ పక్కనే ఉన్న సింగిల్ సోఫాలో కూచున్నాను.

''ఈ శనివారం డాక్టరు దగ్గరికెళ్దాం. రేప్పొద్దున్నే అపాయింట్‌మెంట్ తీసుకుంటాను...'' సగం ఉత్సాహం, సగం సంతోషంతో అన్నాను.

ఎందుకన్నట్లుగా గడ్డంతోనే ప్రశ్నించాడు.

''పీరియడ్ మిస్ అయింది. ఓసారి చెక్ చేయించుకుని....''

దిగ్గున లేచాడు లాప్‌టాప్‌ని పక్కన పెట్టి.

''మనం కాదు... నువ్వు వెళ్తున్నావు. కన్‌ఫర్మ్ అయితే టర్మినేట్ చేయిస్తున్నావు... అర్థం అయిందా! మరోసారి చెప్పాలా!''

ఆ గొంతులోని కాఠిన్యానికి భయపడ్డాను.

''నీకు పరిస్థితి తెలీదా! నేను ఎంబిఎ కోసం యూరోప్ వెళ్తున్నానని తెలుసుకదా! నేను ఉద్యోగం రిజైన్ చెయ్యాలన్న సంగతి నీకు తెలుసు కదా! ఎన్ని లక్షలు అవుతుందో నీకు తెలుసు. మన పెళ్ళికి, ఈ యింటికి, కారుకి లోన్లు తీసుకున్నాం అన్న సంగతి నీకు తెలుసు. ఓ రెండేళ్ళు నా జీతం ఉండదు. అది కూడా నీకు తెలుసు. ఇలాంటి పరిస్థితుల్లో ఓ బేబిని ఈ లోకంలోకి తీసుకురావడానికి ఆ పైన పెంచడం... ఇవన్నీ కష్టం అన్న సంగతి నీకు తెలీదా! ప్రతీది కమర్షియల్. డాక్టర్లు, సిజేరియన్, ఆ పైన నెలకు ఓ ఐదారు వేలు... ఎక్కణ్ణించి వస్తుంది డబ్బు? .....''

గుండెనిండా గాయాలు దెబ్బతిన్న మనసుతో ఏం అనలేదు. ''అయినా యింత ప్రాబ్లెం తెచ్చావేవిటీ? టాబ్లెట్లు సరిగా వేసుకుంటున్నానని అన్నావు కదా..... ఎందుకిలా అయింది? ఇప్పుడు పిల్లల్ని భరించే స్థితిలో లేను... కాదు... కూడదు..... నా యిష్టం అని నువ్వనుకుంటే, పర్యవసానం చాలా సీరియస్‌గా ఉంటుంది...'' అంటూ టీవీని ఒక్కసారిగా ఆపేసి నావైపు చూసాడు.

ఒక్క క్షణం కూడా అక్కడ కూచోలేకపోయాను. నుంచో లేక పోయాను. గబుక్కున వెళ్ళిపోయి మంచం మీద వాలిపోయాను.

అవమానంతో మనసు కుతకుతలాడింది. ఎంత మాటన్నాడు? ప్రాబ్లెం తెచ్చానని అంటాడా!


SVPCET

SRI VENKATESWARA PERUMAL COLLEGE OF ENGINEERING & TECHNOLOGY

(Approved by AICTE, New Delhi, Affiliated to JNTU,Hyd)

R.V.S.Nagar, K.N. Road, PUTTUR, Phone : 08577-201066, 223466

JAS-ANZ S3111204IN

A PLACE - WHERE INNOVATION IS A CULTURE : A GATEWAY FOR ACADEMIC EXCELLENCE



Our Strengths

- Proven Academic Standards
- Campus Placement Mision & Campus Interview for S.V. Group of College
- Top notch faculty
- Striving for imparting intuition skills in III/IV B.Tech. levels
- Student Counselling
- Feedback Based System
- 40% of 2006 passed out batch placed already
- Senior Faculty in all departments
- Continuous addition of course/intake PG courses also approved for 2006-07
- State of the Art Labs
- Technical Fora
- JKC hosting College



Sri K. Venkata Swamy
*Chairman*



Dr. C. Nadamuni Reddy
*Principal*

Courses Offered

- CSE-120
- ECE-120
- EEE-60
- IT-120
- MBA-60
- MCA-60
- M.Tech (CSE)
- M.Tech (VLSI Design) - 18

ఆలోచించి అన్నాడా– అనాలోచితంగా అన్నాడా! ఎలా అన్నా అవమానమే... నలుగురిలో అనకపోయినా, నాలుగ్గోడల మధ్య అన్నా అది అవమానకరమైన మాటే...

నీరవ్ చదువుకున్నవాడే – నాగరీకుడే – సంస్కారం ఉన్నవాడే. కానీ, ఓ భర్తే కదా! ఆ కోణం లోంచి యిప్పుడిప్పుడే బయటికి తొంగి చూస్తున్నాడు.

నా వయసు ముప్పయికి దగ్గర్లో ఉంది. ఇప్పుడు కాకపోతే యింక ఎప్పుడూ పిల్లల్ని కనడం? తర్వాత్తర్వాత పురుడు చాలా కష్టం.

ఒక్కసారి హైద్రాబాద్‌లో ఉన్న అత్తగారికి ఫోన్ చేసి చెప్పాలనిపించింది. ఓ ప్రాణి ఈ లోకంలోకి రావాలా వద్దా అన్నదానికి పెద్దగా చర్చలు అక్కర్లేదనిపించింది. చూద్దాం ఏం జరుగుతుందో అని ఆ మర్నాడు డాక్టరు దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకోలేదు. నీరవ్‌తో మాట్లాడలేదు. ఓ రెండు రోజులు గడిచిపోయాయి. చాలా భయంకరంగా అనిపించింది.

సెల్ మోగుతుంటే గబుక్కున తెలివొచ్చింది. రాత్రి అంత నిద్ర లేదేమో, కళ్ళు విప్పడానికి చాలా ప్రయత్నం చేయాల్సి వచ్చింది.

కళ్ళుతెరవలేక, కుడి చేత్తో, తడుముతూ తలగడకి ఎడమవైపున ఉన్న సెల్‌ని తీసుకుని 'హలో' అని మత్తుగా అన్నాను.

''లే... '' ఆ గొంతు ఎక్కడో విన్నట్లనిపించింది.

''ఎవరూ?'' అంటూనే సెల్ వెలుగులో నంబర్ చూసాను. ఉలిక్కిపడ్డాను.

అది నీరవ్ నంబర్. టైము ఐదున్నర అయింది.

''నీరవ్.''

మత్తు పూర్తిగా దిగిపోయింది. ఆశ్చర్యంగా సెల్ ఆఫ్ చేసి చూసాను. మంచం దగ్గర తన సెల్‌తో నుంచుని ఉన్నాడు.

తట్టి లేపడానికి, పేరుపెట్టి లేపడానికి యిష్టపడలేదంటే, విషయం చాలా వరకు వెళ్తోందన్న మాట.

''ఈ నాలుగు రోజులు అసలు విషయం మాట్లాడుకోకుండా సమస్యని పక్కకి పెట్టేస్తున్నాం. ఇవాళ శనివారం. ఆఫీసుకెళ్ళాల్సిన పని లేదు. మనం మాట్లాడుకోవాలి. కింద కారు దగ్గర ఉంటాను. తొందరగా కిందకిరా...'' అంటూ గబగబ బయటికి వెళ్ళిపోయాడు.

అయోమయంగా అటువైపు చూసాను. ఏం చెయ్యాలి? ఇప్పుడు కిందకి వెళ్తే నీరవ్‌కి సరెండర్ అయినట్లవుతుందా! నీరవ్ మాట వినాలా! అసలు కిందకే వెళ్ళాలా– వద్దా! నా ఆలోచనలకి విలువ నిచ్చుకోవాలా!

నాకు తెలీకుండానే బట్టలు మార్చుకున్నాను. క్లిప్‌తో జుట్టుని బంధించి, తాళం చేతులు తీసుకుని, తలుపు తాళం వేసి కిందకెళ్ళాను. తలుపు తీసి ఉంది. నీరవ్ కూచుని కారు స్టార్ట్ చేసాడు. నేను కూచుని తలుపు వేసాను.

''ఈ మాట్లాడుకోడం యింటి దగ్గరే చెయ్యొచ్చు కదా, దీని కోసం బయటి కెళ్ళాల్సిన పనేవుంది?


కారు కదిలింది.

''పని ఉంది. బయటికే వెళ్ళాలి. ఇంట్లో దీని గురించి, ఆవేశంలో గట్టిగా, గొంతు పెంచుకుని మాట్లాడుకుని పోట్లాడుకుంటే – పక్కవాళ్ళకి ఈ తెల్లారుఝామున వినపడ్తే...''

ఒళ్ళు మండింది. ''వినపడనీ'' నిర్లక్ష్యంగా అన్నాను. ''కానీ, నేనలా అనుకోడం లేదు. నేను నీలా ఉండలేను. వినపడనీ అని లైట్‌గా తీసుకోడం లేదు. మన వాదాలు పక్కవాళ్ళు వినాల్సిన పని లేదు.... ఇవాళ్టి దాని మీద మనం కలిసి ఉండాలా లేదు అని తెలుస్తుంది.''

గుండెల్లో సన్నటి నొప్పి.

సమస్యలకి పరిష్కారాలు ఇంత సులువుగా ఉంటాయా! విడిపోవం ఒక్కటేనా మార్గం ! కౌన్సిలింగ్ అక్కలేదా! పెద్దవాళ్ళని సంప్రదించక్కర్లేదా! ప్రతి సమస్య? విడాకులే పరిష్కారం అయితే, ఈ సమాజంలో నూటికి తొంబై మంది విడాకులు తీసుకుని ఉండేవారు.




ఈ కారుని ఎక్కడో ఆపుతాడు. అక్కడ ఏం అడుగుతాడో తెలుసు. దానికి నేనేం జవాబు చెప్పాలి? ఎలా చెప్పాలి? వెంటనే చెప్పాలా! లేక పోతే ఆలోచించుకోడానికి టైమిస్తాడా! ఏం చెయ్యాలి?

ఇంతలో సెల్ మోగింది.

ఎడం చేత్తో, జేబులోంచి సెల్ తీసాడు.

''హైద్రాబాద్ నుంచి.... డాడీ...'' అని నావైపు చూసాడు. నేను ఏం అనకుండా తలతిప్పి రోడ్డు వైపు చూసాను.

''ఆ... చెప్పండి... '' అంటూ ఓ పక్కగా కారు ఆపాడు.

''రాత్రి అమ్మకి గుండెనొప్పి వస్తే... నాంపల్లి 'కేర్'లో చేర్పించాము. నలభై ఎనిమిది గంటలు దాటాలని అన్నారు... నీరజకి చెప్పు... మావయ్య వరంగల్ నుంచి వచ్చాడు... మీరిద్దరూ కూడా వెంటనే వచ్చేయండి...'' మామగారి గొంతు స్పీకర్ లోంచి వినపడింది.

''అమ్మకేమీ కాదు. మేం వెంటనే బయల్దేరుతున్నాం...'' అంటూ కారుని యింటివైపుకి మళ్ళించాడు.

ఏదో మాటసాయానికి అత్తగారివైపు చూద్దామనుకుంటే... ఏవిటిది! ఎందుకిలా అయింది?

మా కంపెనీ వాళ్ళ అవుట్ సోర్స్ ఏజెంట్లున్నారు. వాళ్ళ జవాబు 'నో' 'కష్టం' 'లేదు'. ఫ్లైట్ వెంటనే ఏం లేదు. ఒకటి రాత్రి ఎనిమిది గంటలకి ఉందిట. కానీ అది కూడా డిలే అవచ్చుట.

''ఏం చేద్దాం? సందేహిస్తూ ప్లేన్‌లో వెళ్ళే కన్నా, కారులో వెంటనే వెళ్ళిపోదాం. అంతేనా!... '' అంటూ ఓ టాక్సీ మాట్లాడాడు.

నేనేం మాట్లాడలేదు. మాట్లాడ్డానికేం లేదు.

యింటికెళ్ళాకానిశ్శబ్దంగా ఎవరి బాగ్, సూట్‌కేస్ వాళ్ళు సర్దుకున్నాం. ఇంకా పూర్తిగా తెల్లారకుండానే టాక్సీలో కూచున్నాం.

ఊరు దాటుతుండగా వర్షం మొదలయింది.

అంతకంతకూ వర్షం పెద్దదయిందే కానీ, తగ్గలేదు. దిగంతాల వరకూ ఉన్న నల్ల మేఘాల నిండా పెద్ద పెద్ద చిల్లులు.

మధ్యలో ఓ పెద్ద ఊరు వస్తే... అక్కడ దిగి టిఫిన్ తిని కాఫీ తాగి బయల్దేరాము.

ఎక్కడ పడ్తే అక్కడ ఏరుల్లా పారుతున్న నీళ్ళు.

''రోడ్ బాగానే ఉంది కదా, వెళ్దామంటారా సార్! లేకపోతే ఎక్కడైన ఆగిపోదామా!'' అన్నారు డ్రైవర్.

''ముందర ట్రక్కులు, ఆయిల్ టాంకర్లు వెళ్తున్నాయి కదా, మెల్లగా తీసికెళ్ళు. ఎంత దూరం వెళ్ళగలిగితే అంత దూరం వెళ్దాం...''

'వద్దు' అందామనుకున్న నేను ఏమీ అనలేదు. ప్రకృతి వర్షంలో అంత భయంకరంగా

ఉంటుందని ఊహించలేదు. ఎప్పుడూ కూడా వర్షంలో తడిసే అందమైన ప్రకృతినే చూసాను. కానీ... ఇదేవిటీ...

రోడ్డు మీద యిసక బాగా పేరుకు పోవడం వల్ల కారు కదలటం కష్టంగా అనిపిస్తే కారు ఆపే సాడు. ఏదో ఊరుకి దగ్గరగా ఉన్నట్లున్నాం. దూరంగా ఒకటి రెండు తెల్ల తెల్లటి యిళ్ళు కనిపిస్తున్నాయి. ఆ వెనకాల నాలుగైదు టవర్లు కూడా ఉన్నాయి.

''ఎలాగో ఓలాగా ఊరి వరకూ వెళ్ళిపోదాం...'' అంటూ మళ్ళా కారు స్టార్ట్ చేసాడు.

అయితే కారు ముందు కెళ్లలేదు. హటాత్తుగా వస్తున్న నీళ్ళ వేగానికి అడ్డంగా వెళ్ళడం మొదలెట్టింది.

''ఏదైనా వాగు పొంగిందేమో... మనం కొట్టుకుపోతున్నట్లున్నాం... భయపడకండి. మా ఆఫీసుకి ఫోన్ చేస్తాను...' అంటూ ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. కారు లోపలికి నీళ్ళు వచ్చేసాయి.

''దిగి పోదామా!...'' యింకా ఏదో అనబోతున్నాడు. నీరవ్.

''వద్దు సార్, అది యింకా ప్రమాదం... మనం కొట్టుకుపోగలం... కారులోనే కొంచెం సేఫ్... మేడం... మీ చున్నీ యివ్వండి. సగం ఈ కిటికీ లోంచి బయటికి వేద్దాం, గాలికి ఎగుర్తుంటే అది చూసి ఎవరైనా సహాయం చేస్తారు...''

నా చున్నీ తీసి యిచ్చాను. అది గాలికి పరపరా శబ్దం చేస్తూ ఎగురుతోంది.

కారు మెల్లగా ప్రవాహంతో నడుస్తోంది.

''భయపడకండి, మా వాళ్ళు ఏదో ఒకటి చేస్తారు. పోలీసు స్టేషన్‌కి కూడా కబురందింది.''

''సమయం మించిపోతే...'' నీరవ్ గొంతులో నీరసం. ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. నిజమే సమయం మించి పోతే... ఈ కారులో ఈ నీళ్ళల్లో కొట్టుకుపోతూ... ఎంత దూరం.. ఎంత సేపు? '' నీళ్ళు పెరుగుతున్నాయి...'' ఆందోళనగా అన్నాడు డ్రైవర్.

''దేవుడే మనల్ని రక్షించాలి. ...'' అంటూ కళ్ళు మూసుకున్నాను.

నిజంగానే దేవుడు రక్షించాడు.

కారు తుమ్మ చెట్లు మధ్యలో ఆగిపోయింది. కదలకుండా ఉన్నాకూడా, నీరు మెల్ల మెల్లగా లోపలికి వొస్తోంది. దూరంగా మనుషులు నుంచుని మావైపే చూస్తున్నారు.

ఒక్కసారిగా, నీరవ్ నావైపు తిరిగి, నా చేతుల్ని తీసుకుని తన చెంపల కానించుకున్నాడు.

వారం రోజుల్నించి వేధిస్తున్న సమస్యని, దొలి చేస్తున్న సమస్యని మీ మధ్య దూరం పెంచిన సమస్యని మరిచిపోయాను.

బెంగగా నీరవ్ భుజం మీద తల ఆనించాను.

''ఇది మన ఆఖరి ప్రయాణం కావచ్చు. ద లాస్ట్ రైడ్ టు గెదర్...''

జీవితం యిలా నీళ్ళల్లో కొట్టుకుపోతున్న కారులో ముగుస్తుందా! ఇంతకు ముందు జరిగిన దానికి విలువ లేదా! విలువ లేని దాని కోసం ఐదు రాత్రుళ్ళు నిద్రపోలేదు.. అబ్సర్డ్... రిడిక్యులస్.

డ్రైవర్ సెల్ మోగింది.

''భయపడకండి. ఆర్మీ వాళ్ళని తీసుకుని వస్తున్నాం...'' ఆ విషయాన్ని మాతో అన్నాడు.

ఆర్మీ వాళ్ళెప్పుడొస్తారో, ఆ లోపల నీళ్ళు కారులోకి వచ్చేస్తే... ఆస్పత్రిలో చేరిన తల్లిని చూడ్డాని కెళ్తూ చనిపోయిన దంపతులు అన్న వార్త నా కళ్ళ ముందు కనపడ్తోంది.

''ఎక్కడో మనకి అదృష్టం ఉంది – కాబట్టే ఈ పొదల మధ్య కారు ఆగిపోయింది. దేవుడిని మనం నమ్ముతాం కాబట్టి, ఎవరో ఒకరు మనల్ని రక్షిస్తారు చూడండి, ఊళ్ళో జనం వచ్చి ఉన్నారు. వాళ్ళు అలా చూస్తూ ఊరుకోరు కదా, ఏదో ప్రయత్నం చేస్తూంటారు... ధైర్యంగా ఉండండి మేడం...'' అన్నాడు డ్రైవర్. ఆశావాది తత్వం.

''ఏదైనా మాట్లాడుకుందాం...'' భయపడ్తూ టైం గడపడం చాలా ఘోరం... ఓ.కే....''

తలూపాను. ''మనం మన బలహీనతల గురించి, లోపల గురించి మాట్లాడుకోవద్దు. మనకి ఎక్కువ టైముందో లేదో తెలీదు. మామూలు మనుషులుగా మాట్లాడుకుందాం. ఈ లోకంలోకి




వచ్చాం. కలుసుకున్నాం. నువ్వు నా భార్యని కాదు, నేను నీ భర్తని కాను. జండర్ బైయస్ లేదు. ఒకరి మీద ఒకరికి అధికారం లేదు. ఇగోల్లేవు. ఈర్ష్య ల్లేవు. మన చర్మాల కింద ఉన్నది ఒకటే. భేదం లేదు....''

నా కళ్ళు నీటితో నిండిపోయాయి.

''ఇది ... సరిగ్గా యిదే నేను కోరుకున్నాను. మొగుడు పెళ్ళాం మధ్య భేదం ఎందుకుండాలి? ఎక్కువ తక్కువ లెందుకుండాలి?.... కానీ.. నువ్వే నన్ను అర్థం చేసుకోలేదు...''

ఒక్కసారి నా చేతుల్ని పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు.

''నిజమే నీరజా... జరిగినదానికి యిప్పుడు సారీ చెప్తున్నాను. నువ్వు భార్య వైనంత మాత్రానా నిన్ను అనాలన్న నియమం లేదు. ఇప్పుడనిపిస్తోంది భర్తగా నా బాధ్యతలు నేను నిర్వర్తించలేదేమోనని. జీవితం అయిపోతోంది, అని తెలిస్తే మంచిగా ఉండాలనిపిస్తుందేమో!''

నిట్టూర్చాను. బయటి వర్షం కొంచెం తగ్గినట్లుంది.

'' ఎన్నో కలలుండేవి. వెన్నెల్లో తాజ్‌మహల్ చూడాలని, వెన్నెల్లో బేడా ఘాట్ల మధ్య నర్మదా నదిలో పడవలో ప్రయాణించాలని కుంగిపోతున్న వోల రాడోని, నార్వేలోని మిడ్‌నైట్ సన్‌ని ఎన్నో... ఎన్నో... యింకా వర్షంలో తడ వడం... కానీ... యిప్పుడు ఈ వర్షం ఆ యిష్టాన్ని తన్నేసింది ముంచేసింది....

మాట్లాడుతుంటే భయం పోయింది.

''నేను కూడా, జీవితాన్ని గురించిన కలలు కన్నాను. కలల్ని జేబులో పోసు కుని తిరిగే వాణ్ణి. ఐ. ఐ. టిలో సీటు రాకపోతే ... చాలా బాధ పడ్డాను. ఇంజనీ రింగ్ చదివి, మంచి ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబిఏ చేయాలనుకున్నాను. మంచి దానిలో రావాలంటే అనుభవం ఉండాలి. ఇప్పుడు ఆ అనుభవం వచ్చింది. ఇండియాలో రాకపోయినా యూరోప్‌లో వచ్చింది. అంత అయిపోయాకా... నా కల.. నిజమయ్యే వేళ... ఇలా... '' అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.

నేను ధైర్యం చెప్తున్నట్లుగా తల మీద జుట్టుని నిమిరాను. ''దేవుడు మనకి సమయం యివ్వడం లేదు. ఏవిటో యిద్దరం బిజీగా ఉండిపోయాం... పోన్లే... యిప్పుడెవరైనా కలలు అమ్మేవాళ్ళు, యిలా మన పక్క నుంచి పడవలో వెళ్తూ, కలలు అమ్ముతాం కొంటారా?... అని అంటే....'' పక్కున నవ్వాను.

''నవ్వకు... చెప్పు... అదిగో మళ్ళీ నవ్వుతున్నావ్.. ఎలాంటివి కొంటావ్?''

ఆలోచనలో పడ్డాను. ఏం కలలు కొంటాను? నిట్టూర్చే కలలా! గుడి గంటల్లా పదే పదే వినిపించే కలలా! జీవితాన్ని కదిలించే కలలా! ఆశల్ని రేపే కలలా! ''శక్తి ఉన్న కలల్ని, మెరుపులున్న కలల్ని'' ఒక్కసారి తన చేతిని నా కడుపు మీద ఉంచాడు.

'' నేను రాక్షసుడిని కదా.. నేను చాలా చెడ్డవాడిని. ఓ జీవితాన్ని లాక్కునే హక్కు నాకుందనుకున్నాను. కానీ, ఆ దేవుడికే ఆ హక్కుంది.. మనుషులకి లేదు. అజ్ఞానం నాది. మూర్ఖుడ్ని... భర్తగా నా బాధ్యతలు ఎంత నిర్వర్తించానో నాకు తెలీదు, కానీ, తండ్రిగా మటుక్కు రాక్షసుడిలా ప్రవర్తించాను కదూ! ఈ నాగరిక ప్రపంచానికి ప్రతినిధిని... స్వార్థాన్ని చూసుకునే నాగరికత నాది... చాలా చెడ్డవాణ్ణి...'' అంటూ నా చేతుల్లో మొహం దాచుకున్నాడు.

''నేను ఓ మంచి తండ్రి నవుతా, కానీ, దేవుడు నాకు టైమివ్వడం లేదు... నేను నిరూపించుకునేందుకు సమయం లేదు...''

''దూరంగా హెలికాప్టర్ వస్తోంది... సార్... మనకి సహాయం అందు తోంది... '' అంటూ సంతోషంగా అరిచాడు. డ్రైవర్... నిజమే... నా బుగ్గల మీద జారిన నీటి బొట్లు, గాల్లో కలిసిపోయాయి. హెలికాప్టర్ వైపు చూసాం. నిచ్చెన కిందకి దింపుతూ మా వైపుగా వచ్చింది. నాకది హెలికాప్టర్ లాగ అనిపించ లేదు. వెయ్యేళ్ళు మొసలితో యుద్ధం చేసి అలసిపోయిన, ఏనుగుని రక్షించడా నికి గరుడ వాహనం మీద వస్తున్న విష్ణు మూర్తిలా అనిపించింది. మీ కోసం విష్ణువు హెలికాప్టర్ అవతారం ఎత్తాడు. అప్రయత్నంగా మీ కిటికీ ముందు నుంచున్న ఆ మనిషికి చేతులెత్తి దండం పెట్టాను. తేజస్సుతో ఉన్న విష్ణుమూర్తి సుదర్శన చక్రం లేని విష్ణుమూర్తి.

''నీరజా... మెల్లగా... జాగ్రత్త...'' అంటున్న నీరవ్ గొంతులోని మార్దవం నన్ను కదిలించింది. ఈ జీవితానికి దేవుడు ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నాడు అన్న ఫీలింగ్ వచ్చిన రోజున మనిషి మారుతాడనిపించింది.

★

# దీపశిఖ

-లలితానంద్



అనివార్య పోరుగడ్డలో
నీటి మాటేమో!
కొదువలేని కన్నీరు
కన్నీటిచుక్కలో
ప్రాణవాయువు లేదు
ఉన్నదంతా హైడ్రోజన్
ఎప్పుడు, ఎక్కడ, ఏ నిశ్శబ్ద విస్ఫోటనమో!

కన్నీటచుక్కలో
చుక్కనీరు లేదు
ఉన్నదంతా మరిగి మరిగి
కారిన వేదన రక్తపుటావిరి

కన్నీటి చుక్క
చిక్కబడ్డ చీకటి
అంతరంగ తరంగం
కంటి తీరం దాటి వ్రేలాడే
ప్రశ్నార్థక అస్తిత్వ ప్రతీక

ప్రాణి ఉనికిని ప్రకృతిలా
కాపాడే కరుణాంకురం
ప్రశ్న క్రింద ప్రజ్ఞా స్థిరబిందువు
కన్నీటిచుక్క

నెలవంక ఎత్తుటి
నెత్తుటి శిలువనిచ్చిన
సతతహరిత బోధివృక్షం కన్నీటిచుక్క
కాలంపై కారే కన్నీటిచుక్కే
మహి ప్రమిదలో ఆరని దీపశిఖ